సాక్షి
నిజామాబాద్
శనివారం । 14 । డిసెంబర్ । 2024



రైల్వే పోలీసుల నిజాయితీ

రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై దొరికిన రూ. లక్ష బ్యాగ్‌ను రైల్వే పోలీసులు ప్రయాణికుడికి అందించారు.

- 8లో ▸



మమ అనిపించారు!

సీఎం కప్ పోటీలకు యువత దూరంగా ఉంటోంది. అధికారులు పాఠశాలల విద్యార్థులతోనే పోటీలు కొనసాగిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.9 /10.0

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

అరుణాచలంకు బస్సు ప్రారంభం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి తమిళనాడులోని ప్రముఖ పుణ్య క్షేత్రం అరుణాచలంకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసీ బస్సును శుక్రవారం ఆర్‌ఎం జ్యోత్స్న ప్రారంభించారు. ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపి, మిఠాయిలు పంచారు. దైవదర్శనానికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిక్కెట్ రిజర్వేషన్‌కు ఆన్‌లైన్ చెల్లింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకునే వారికి ఆన్‌లైన్ చెల్లింపుల సౌకర్యం కల్పించినట్లు నిజామాబాద్ డిపో–1 మేనేజర్ ఆనంద్ శుక్రవారం తెలిపారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు.

మీ-సేవలో 9 కొత్త సర్వీసులు ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్: మీ సేవ సర్వీసు ద్వారా జిల్లా ప్రజలకు కొత్తగా 9 రకాల సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుంచి 6 రకాల సర్వీసులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నుంచి 2 రకాల సర్వీసులు, ఉమెన్‌అండ్ చైల్డ్ వెల్ఫేర్, సీనియర్ సిటిజన్ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక సర్వీసు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్యాప్ సర్టిఫికెట్, నేమ్ చేంజ్ ఆఫ్ సిటిజన్, లోకల్ క్యాండిడేట్ సర్టిఫికెట్, మైనారిటీ సర్టిఫికెట్, ఆదాయం, కులం సర్టిఫికెట్ రెన్యువల్, క్రిమిలేయర్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ మానిట రింగ్ సిస్టం అప్లికేషన్, వన్య ప్రాణులచే చంపబడిన మానవ/పశువులకు పరిహారానికి సంబంధించిన అప్లికేషన్, సామిల్/ టింబర్ ఫ్రెష్- రెన్యువల్ అప్లికేషన్ సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు. గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని మీసేవ నిర్వాహకులకు నూతన సర్వీసులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ సర్వీసులను వినియోగించుకోవాలన్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ఎస్సారెస్పీలో పూడికతీస్తాం

- ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకొస్తాం
- ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ 20, 21 పనులను పూర్తి చేస్తాం
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూడికతీతకు చర్యలు చేపడుతామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రాజెక్టును సందర్శించిన ఆయన ముప్కాల్ మండల కేంద్ర శివారులోని ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌజ్ వద్ద నీటిపారుదల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మొదట్లో 112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూడిక పేరుకుపోయి ప్రస్తుతం 80 టీఎంసీలకు పడిపోయిందన్నారు. ప్రపంచంలోనే నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్సారెస్పీలోని పూడికను తొలిగించి తిరిగి పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి తీసుకువస్తామన్నారు. పూడిక తొలగింపుపై కేంద్ర ప్రభుత్వంతో కూడ చర్చించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుల్లో పూడిక తీతకు 50 శాతం నిధులు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం భారత దేశంలోనే గొప్ప చారిత్రక కట్టడమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్సారెస్పీతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ 20, 21, 23, 27 పనులు ఇప్పటి వరకు పూర్తయిన నుంచి ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా 21 ప్యాకేజీ పనులు పూర్తి చేసి బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు

ఇరిగేషన్ శాఖలోని ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇరిగేషన్ శాఖలో అనేక మార్పులు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 700 ఏఈఈ పోస్టులను, 1800 లష్కర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించామన్నారు. యూపీఎస్సీ ద్వారా మరో 1300 పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాళేశ్వరం నుంచి చుక్క నీటిని వినియోగించకుండానే రాష్ట్రంలో 66.7 లక్షల ఎకరాల్లో వానా కాలంలో వరి పంటను సాగు చేసి 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే రైతు ప్రభుత్వమన్నారు. ప్రాజెక్టులకు, లిఫ్టులకు మెయింటెనెన్స్ కోసం నిధులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై భారం మోపి రూ. లక్షల కోట్లల్లో అప్పులు చేసిందన్నారు. ప్రస్తుతం వడ్డీలు చెల్లించలేక పోతున్నామన్నారు. ఇరిగేషన్ వ్యవస్థలను గాడిలో పెట్టడానికి కొన్ని సంస్కరణలకు సిద్ధమవుతున్నామన్నారు. రైతు రుణ మాఫీ త్వరలోనే పూర్తిగా చేస్తామన్నారు. ఎన్నికల వేళ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. నేషనల్ డ్యాం సెఫ్టీ బృందం అన్నారం, మేడిగడ్డ, కాళేశ్వర్ డ్యాంల ద్వారా నీటి సరఫరాకు ప్రస్తుతం అనుమతివ్వలేమని లిఖిత పూర్వకంగా తెలిపిందన్నారు. సమావేశంలో బోధన్, నిజామాబాద్ రూరల్, జుక్కల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతి రెడ్డి, లక్ష్మీ కాంతారావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి , రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఈఎన్‌సీ సుధాకర్, బాల్కొండ, ఆర్మూర్ నియోజక వర్గాల కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జులు ముత్యాల సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి , ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి

ప్రతి నీటి చుక్క సద్వినియోగం కావాలి



సమీక్షలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి , ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, రాకేశ్ రెడ్డి

బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోని ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని భారీ నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్ర శివారులోని ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌస్‌లో ప్రాజెక్టు ఆయకట్టు జిల్లాల నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి ప్రాజెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేసే కాలువల గుండా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టులో పూడికను అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి తొలిగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయకట్టు రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఆర్మూర్, కోరుట్ల, బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్, జుక్కల్ నియోజక వర్గాల ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, సంజయ్ కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, లక్ష్మీకాంతా రావు, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సీఈలు, ఎస్ఈలు, ఈఈలు పాల్గొన్నారు.

నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్: భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాన్సువాడ, బోధన్, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతారావులతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. అనంతర మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్టు నిర్మాణం విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో పాటు అక్కడి అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానన్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిజాంసాగర్ ప్రాజెక్టు కింద వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తుగా పంటలు సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. సింగూరు ప్రాజెక్టు నుంచి మూడు, నాలుగు టీఎంసీల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేయిస్తే ఆయకట్టుకు మేలు జరుగుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యంత వెనకబడిన జుక్కల్ నియోజకవర్గంలోనే నిజాంసాగర్ ప్రాజెక్టు ఉన్నా 2,700 ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతుందని స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. లెండి ప్రాజెక్టుతో పాటు నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయిస్తే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి మరమ్మతులు లేక కాలువలు శిథిలావస్థకు చేరాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంతారావు తదితరులు

వీరన్నగుట్టలో ఉద్రిక్తత



దాడికి పాల్పడిన వారి ఇంటి ముందు ధ్వంసం చేస్తున్న మృతుని బంధువులు

- మతిస్థిమితంలేని ఏడేళ్ల బాలికపై అత్యాచారం !
- నిందితుడిపై బాధితురాలి బంధువుల దాడి
- చికిత్స పొందుతూ మరుసటి రోజు నిందితుడు మృతి
- దాడిచేసినవారి ఇళ్లపై మృతుని కుటుంబీకుల దాడి
- భారీగా మోహరించిన పోలీసు బలగాలు

రెంజల్(బోధన్): తాత వయస్సున్న వ్యక్తి మతిస్థిమితం లేని ఏడేళ్ల బాలిక పై అత్యాచారం చేసినట్లు అనుమానించిన బాలిక బంధువులు తీవ్రంగా దాడి చేయడంతో నిందితుడు మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెంజల్ మండలం వీరన్నగుట్ట తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక నాయనమ్మతో పక్కనే గల కిరాణా దుకాణానికి వెళ్లింది. బాలిక అక్కడే నిలిచి పోవడంతో వృద్ధురాలైన నా యనమ్మ ఇంటికి చేరుకుంది. కొద్ది సేపటికి బాలిక కోసం తల్లి అక్కడికి వెళ్లింది. బాలికపై దుకాణ యజమాని రత్నావర్ రెడ్యా అత్యాచారం జరిపినట్లు అనుమానించిన తల్లి కుటుంబీకులకు తెలిపింది. ఈ క్రమంలో ఇరువురి కుటుంబాల మహిళలు పరస్పరం దూషించుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. బాలిక తండ్రితో పాటు అతని సోద రులు అక్కడికి చేరుకుని రెడ్యాను రొడ్డు పైకి తీసుకొచ్చి తీవ్రంగా చితకబాదారు. కిరాణ దుకాణం ధ్వంసం చేయడంతో పాటు ఇంటిని తగుల బెట్టేందుకు ప్రయత్నించారు. బాలిక బంధువు డయల్ 100కు ఫోన్ చేయడంతో రెంజల్ ఎస్సై సాయన్న సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. రెడ్యాను ని జామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించిన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెడ్యా శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రూరల్ సీఐ విజయ్, ఎస్సై సాయన్న గ్రామానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అప్పటికే రెడ్యా మృతి చెందిన సమాచారం అందిన మృతుని బంధువులు దాడికి పాల్పడిన వ్యక్తుల ఇళ్ల పై దాడికి ప్రయత్నించారు. బాలిక తండ్రి ఇంటిని తగుల బెట్టేందుకు పెట్రోల్ బాటిల్‌తో రాగా పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో పరిస్థితి విషమించడంతో ప్రత్యేక పోలీసు బలగాలను రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మృతుని కుటుంబీకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ట్రెయినీ ఐపీఎస్ అధికారి పత్తిపాక సాయికిరణ్ గ్రామానికి చేరుకుని పరిస్థితులను తెలుసుకున్నారు. రెడ్యా గతంలో స్థానికంగా వడ్డీలకు ఇస్తుండేవాడని, అతని వద్ద వడ్డీలకు డబ్బులు తీసుకున్న బాలిక బంధువులు చెల్లించలేక అత్యాచారం చేశాడని చితకబాది హత్య చేశారని ఆరోపించారు. పథకం ప్రకారం దాడి చేసినట్లు బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌కు వివరించారు. రూరల్ సీఐతో పాటు నిజామాబాద్ సీఐ సురేశ్, ట్రాఫిక్ సీఐ చందర్‌రాథెడ్, ఆర్ఐ శ్రీకాంత్‌లతో పాటు సర్కిల్ పరిధిలోని నలుగురు ఎస్సైలు అదనపు పోలీసులు గ్రామంలో బందోబస్తులో పాల్గొన్నారు.



మృతుడు రెడ్యా (ఫైల్)



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మృతుని కుటుంబీకులు

పండుగలా నిర్వహించాలి

- డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాలపై కలెక్టర్ వీసీ సమీక్ష
- ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఆదేశం

నిజామాబాద్‌అర్బన్/బాల్కొండ: ఈనెల 14న నిర్వహించనున్న సంక్షేమ వసతి గృహాల్లో డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించి, విజయవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎస్సారెస్పీ పర్యాటనతో శుక్రవారం కలెక్టర్‌కు ప్రాజెక్ట్ వద్దనే సమయం గడిచిపోవడంతో బాల్కొండ మండల కేంద్రంలోనే ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల్కొండ తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమం ఏర్పాట్లపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహ సీల్దార్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రెసిడెన్షియల్ గురుకులాలు, హాస్టల్‌లలో 40శాతం డైట్, 200శాతం కాస్మొటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాలలోని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి భోజనం చేస్తారని తెలిపారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పాఠశాలల తనిఖీ, మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యార్థులతో ఇష్టాగోష్ఠి, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు కామన్ డైట్ బ్యానర్ ఆవిష్కరణ, హ్యాండ్ బుక్ విడుదల, ముఖ్య అతిథి ప్రసంగం, 1గంటల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భోజనాన్ని పరిశీలించి, ఏవైనా సమస్యలు గుర్తిస్తే వాటిని పొందుపరుస్తూ తనకు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులతో పనులు చేయించకూడదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై సమీక్ష

ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా వాస్తవ వివరాలను సేకరిస్తూ మొబైల్ యాప్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రస్తుతం సేకరించే వివరాలు వచ్చే నాలుగేళ్ల పాటు ప్రభుత్వం పరిగణలోకి తీసుకోనున్నందున సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్, అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంతా కుమ్మక్కయ్యారు..

- రిజిస్ట్రేషన్ శాఖలో దోపిడీ పర్వం !
- డాక్యుమెంట్ రైటర్లు, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌లు ఒక్కటయ్యారు
- పెండింగ్ డాక్యుమెంట్లన్నింటికీ రెక్కలు
- 'డీఐజీ' పేరు చెప్పుకుని చక్రం తిప్పుతున్న సదరు ఇన్‌చార్జి అధికారి
- అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పర్యవేక్షణ లేమి



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గుమిగూడిన ప్రజలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీన్ రివర్సయింది. పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయింది. మొన్నటివరకు డాక్యుమెంట్ రైటర్లు వర్సెస్ సబ్ రిజిస్ట్రార్ ఉండగా, నేడు పరిస్థితులు భిన్నంగా మారిపోయాయి. హాట్ సీటుపై డీఐజీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కన్నేశాడు. ప్రతికూల పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నాడు. డాక్యుమెంట్ రైటర్లకు కొరకరాని కొయ్యగా మారిన సబ్ రిజిస్ట్రార్‌ను అడ్డు తొలగించుకోవాలనుకుంటున్న తరుణంలో సదరు అధికారి వీరికి దగ్గరయ్యారు. హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులకు లేనిపోనివి నూరి పోశాడు. చివరకు ఆ నిఖార్సైన సబ్ రిజిస్ట్రార్‌ను సెలవుల్లో వెళ్లేలా చేశాడు. ఆ సీటుపై కన్నేసిన అధికారికే ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అంతా కుమ్మక్కై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దోపిడీకి తెర లేపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు. ఆయన ఏం చేసినా అడిగేవారు లేకుండాపోయారు. డాక్యుమెంట్ రైటర్లు, వారి అసిస్టెంట్లుకు రెడ్ కార్పెట్ పరుస్తున్నాడు. బ్రోకర్లు కార్యాలయంలోకి దర్జాగా వస్తున్నారు. పనులు చక్కబెట్టుకుంటున్నారు. బయటి వ్యక్తులెవ్వరూ లోపలికి రావద్దన్న నిబంధనలను పక్కనపెట్టారు. వారితో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుండటంతో వారిని ఆపడానికి ఎవరూ సాహసించడం లేదు. డీఐజీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కావడం వల్ల జిల్లా రిజిస్ట్రార్ సైతం ఆయన అక్రమార్జనను చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

డీఆర్ సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జిగా సబ్ రిజిస్ట్రార్-1 కిరణ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా నాలుగైదు రోజుల క్రితమే సబ్ రిజిస్ట్రార్-1గా బాధ్య తలు స్వీకరించారు. కార్యాలయంలో జరుగుతున్న తతంగాన్ని ఆయనేం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సదరు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని కార్యాలయంలో గుసగుసలాడుతున్నారు. స్వార్థం మేరకు ఏకంగా డీఐజీ పేరు కూడా వాడుతున్నట్లు వినికిడి.

22 రోజుల్లో ..

రిజిస్ట్రేషన్ శాఖలో నాలుగు నెలల క్రితం బదిలీలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన రివ్యూలో 257 సర్క్యులర్‌ను పాటించాల్సిందేనని ఆదేశించారు. అప్పటి నుంచి నాన్ లేవుట్, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నుల రషీదులతో పాటు ప్లాట్‌ను విభజించి రిజిస్ట్రేషన్లు చేయడం నిలిపివేశారు. నాలుగు నెలలుగా డాక్యుమెంట్ రైటర్ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డాక్యుమెంట్లు పక్కనపెట్టారు. సబ్ రిజిస్ట్రార్‌పై డాక్యుమెంట్ రైటర్లు నిరసనకు దిగారు. తొమ్మిది రోజులు కార్యలాపాలకు ఆటంకం కలిగించారు. పదో రోజు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వచ్చాడు. దాంతో డాక్యుమెంట్ రైటర్ల పని యథావిధిగా మారింది. వారి అక్రమాలకు హద్దులు లేకుండా పోయింది. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంటన్నింటినీ వరుసగా రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 12 వరకు 22 రోజుల్లో రికార్డుస్థాయిలో 650 పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. ఈ రిజిస్ట్రేషన్లలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

శబరిమలకు ప్రత్యేక బస్సులు



ఖలీల్‌వాడి: శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం టీజీఎస్‌ఆర్టీసీ భారీ తగ్గింపుతో ప్రత్యేక అద్దె బస్సులను ఏర్పాటు చేసిందని ఆర్‌ఎం జ్యోత్స్న శుక్రవారం తెలిపారు. నిజామాబాద్ రీజియన్‌లోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి శబరిమలై యాత్రకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. బస్సులో ఆడియో, వీడియో పెట్టుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. శబరిమల కార్యకలాపాల కోసం బస్సుల్లో సీట్లు ఇవ్వకుండా ఇద్దరు వంట మనుషులకు ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తామని తెలిపారు. అంతేకాకుండా శబరిమల బస్సుల్లో సీట్లు ఇవ్వకుండా ఇద్దరు మణికంఠలకు(10 ఏళ్ల కంటే తక్కువ ఉన్నవారు) కూడా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రయాణికుల సామాను తీసుకెళ్లేందుకు ఓ అటెండెంట్‌కు సైతం సీటు ఇవ్వకుండా ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టిక్కెట్ బుకింగ్‌ల కోసం ఆర్మూర్-7382843133, బోధన్-9849500725, నిజామాబాద్-9959226022, బాన్సువాడ-9491105706, కామారెడ్డి-7382843747 నంబర్లను సంప్రదించాలన్నారు.

28 వరకు ట్యూషన్ ఫీజు రెన్యువల్‌కు అవకాశం

నిజామాబాద్ అర్బన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ తృతీయ, ద్వితీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సర ట్యూషన్ ఫీజు ఈనెల 28 వరకు రెన్యువల్ చేసుకోవచ్చని కోఆర్డినేటర్ రంజిత శుక్రవారం పేర్కొన్నారు. అలాగే గ్రూప్-2 పరీక్షల కారణంగా శనివారం, ఆదివారం నిర్వహించే డిగ్రీ, పీజీ తరగతులను వాయిదా వేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



దోమకొండ: ఆలిండియా యూనివర్సిటీ జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు దోమకొండకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు అర్చరీ కోచ్ ప్రతాప్‌దాస్ శుక్రవారం తెలిపారు. పోటీలకు దోమకొండ మండల కేంద్రానికి చెందిన కదిరే సింధూజ, బోరెడ్డి నిఖిత, భవాని ఎంపికైనట్లు కోచ్ వెల్లడించారు. ఈ నెల 24 నుంచి 27 వరకు ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో సింధూజ, నిఖిత ఉస్మానియా యూనివర్సిటీ తరఫున, భవాని తెలంగాణ యూనివర్సిటీ తరుపున పాల్గొంటారన్నారు. ఈ మేరకు ముగ్గురు క్రీడాకారులు భువనేశ్వర్‌కు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ముగ్గురు క్రీడాకారులను అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కామినేని, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ నర్సింహారెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు తిరుమల గౌడ్, సెక్రటరీ కదిరి మోహన్ రెడ్డి, ట్రెజరర్ గంగాధర్ అభినందించారు.

గ్రూప్-4లో కానిస్టేబుల్ ప్రతిభ

భిక్కనూరు: ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాకేశ్ జిల్లాలో మూడో ర్యాంక్ సాధించాడు. ఈ విషయమై శుక్రవారం రాకేశ్‌ను భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయి కుమార్‌లు శాలువాతో సత్కరించి అభినందించారు. సీఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మంచి సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు.

మంత్రి ఉత్తమ్‌కు ఘన స్వాగతం

- పోలీసుల భారీ బందోబస్తు
- బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


మంత్రికి స్వాగతం పలుకుతున్న సునీల్‌రెడ్డి


పునరుజ్జీవన పథకం పంపు హౌజ్ వద్ద పోలీసులు

బాల్కొండ: ఎస్సారెస్పీ సందర్శనకు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు హెలికాప్టర్‌పై వచ్చారు. మంత్రికి కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించారు. నియోజకవర్గంలో సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎస్సారెస్పీ పర్యాటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రాజెక్ట్ కాలనీతో పాటు, ఎస్సారెస్పీ గెస్ట్ హౌజ్, హెలిప్యాడ్, ప్రాజెక్ట్ ఆనకట్ట, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపు హౌజ్‌లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డీసీపీ, ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు మోహరించాయి. హెలిప్యాడ్ వద్దకు, ప్రాజెక్ట్ పైకి మీడియాను అనుమతించకుండా భద్రత ఏర్పాటు చేశారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపుహౌజ్ వద్ద ఇరిగేషన్ అధికారుల సమీక్షా సమావేశంలో బాల్కొండ, ఆర్మూర్, కోరుట్ల ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, సంజయ్‌కుమార్ హాజరు కావడంతో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కావడంతో ఏవైనా అల్లర్లు జరుగుతాయని భావించి భద్రతను పెంచారు. బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులను ముందస్తుగా అరెస్టులు చేసి స్వంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు.

ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. శుక్రవారం ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చిన మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మంత్రికి ఎస్సారెస్పీలో ఉన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చౌటపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం పైపులైన్‌లకు లీకేజీలు ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్యాకేజీ 21 పనులను పూర్తి చేస్తే రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. తాను విన్నవించిన సమస్యలను మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

మరమ్మతులకు నిధులు కేటాయించండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా నిర్మించిన ఎత్తి పోతల పథకాల మోటార్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముప్కాల్ మండల శివారులోని ఎస్సారెస్పీ పునరుజ్జీవ న పథకం పంపు హౌజ్ వద్ద ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నా రు. ఆర్మూర్ నియోజకవర్గంలోని నికాల్‌పూర్, మారంపల్లి, వన్నెల్(కే), తల్వేదా ఎత్తిపోతల మోటార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. గుత్ప ఎత్తిపోతల పథకానికి అదనంగా మరో లిఫ్టును మునిపల్లి వరకు చేప ట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఇది పూర్తయితే మాక్లూర్ మండలంలో 8, జక్రాన్‌పల్లి మండలంలో 5 గ్రామాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే మంత్రి నిధులు మంజూరు చేస్తానన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

మమ అనిపించారు!


భీమ్‌గల్‌లో విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో

- సీఎం కప్ పోటీలకు ఉత్సాహం చూపని యువత
- అనేక చోట్ల పాఠశాలల విద్యార్థులతోనే పోటీలు

మోర్తాడ్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలకు యువత దూరంగా ఉంటోంది. దీంతో అధికారులు పాఠశాలల విద్యార్థులతోనే పోటీలు కొనసాగిస్తూ మమ అనిపిస్తున్నారు. గడచిన శని, ఆదివారాల్లో గ్రామ స్థాయి పోటీలు, మంగళ, బుధ, గురువారాల్లో మండల స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలను గ్రామ, మండల స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. కానీ కొన్ని చోట్లే యువత కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా మెజారిటీ గ్రామాలు, మండల స్థాయిల్లో పాఠశాలల విద్యార్థుల మధ్యే పోటీలు జరిగాయి. ఇదిలా ఉండగా ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు అనువైన స్థలం లేకపోవడంతో వాలీబాల్ పోటీలతో సరిపెట్టారు. యోగాపై ఎవరికి సరైన అవగాహన, శిక్షణ లేకపోవడంతో యోగా పోటీల నిర్వహణ సాగలేదు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలను మాత్రం నిర్వహించారు. సీఎం కప్ పోటీల నిర్వహణపై అంతటా దండోరా వేయించినా పోటీల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రాలేదు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగానికి క్రీడా పోటీలను ఎలాగైనా నిర్వహించాలనే లక్ష్యం ఉండటంతో విద్యార్థులతో మమ అనిపించారని వినిపిస్తున్నాయి.

రైల్వే పోలీసుల నిజాయితీ

- ప్లాట్‌ఫాంపై మరిచిపోయిన రూ. లక్ష బ్యాగ్ ప్రయాణికుడికి అందజేత


ప్రయాణికుడికి బ్యాగ్ అందజేస్తున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి

ఖలీల్‌వాడి: రూ. లక్ష నగదు ఉన్న బ్యాగును రైల్వే ప్లాట్‌ఫాంపై మరిచిపోయిన సదరు ప్రయాణికుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు రైల్వే పోలీసులు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం ముంబై నుంచి నిజామాబాద్‌కు వచ్చిన రైలులో జగిత్యాల జిల్లాకు చెందిన మామిడాల నర్సయ్య రైలు నుంచి దిగాడు. జగిత్యాలకు త్వరగా వెళ్లాలనే తొందరలో నగదుతో ఉన్న బ్యాగును ప్లాట్‌ఫాంపైనే మరిచిపోయాడు. ఉదయం 7 గంటలకు విధుల్లో భాగంగా రైల్వే పోలీసులు ప్లాట్‌ఫాంను చెక్ చేస్తుండగా బ్యాక్ కనిపించింది. చుట్టు పక్కల ఎవరూ కనిపించక పోవడంతో ఆ బ్యాగ్‌ను రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి చెక్ చేశారు. అందులో రూ. లక్షా ఎనిమిది వేల నగదుతో పాటు ఒకటిన్నర తులం బంగారు చైన్, అర తులం ఉంగరం, దుస్తులు, ఫోన్ కనిపించాయి. వెంటనే ఫోన్ ద్వారా అందులో ఉన్న ఏటీఎం కార్డు ద్వారా జగిత్యాలకు చెందిన మామిడాల శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌లో బ్యాగ్‌ను, నగదును ప్రయాణికుడిని అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ కుబేరుడు, కానిస్టేబుల్ సీనా నాయక్, ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పాషాను ప్రత్యేకంగా ఎస్సై సాయిరెడ్డి అభినందించారు.

ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సుభాష్‌నగర్: ఉత్తరప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో డిస్కాంల ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని జేపీసీ రాష్ట్ర నాయకులు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఉద్యోగ సంఘాలు దేశ వ్యాప్తంగా ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నగరంలోని పవర్ హౌస్ వద్ద విద్యుత్ ఉద్యోగులు జేపీసీ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో ఢిల్లీ, ముంబైలో డిస్కాంల ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నించగా, నష్టాలతో, వినియోగదారులకు సరైన సేవలు అందించక నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో కూడా ప్రయివేటీకరణ చేస్తామని ప్రకటించడంతో దేశవ్యాప్తంగా నిరసన, వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో నిలిచిపోయిందని, అయినా మరోసారి అక్కడి ప్రభుత్వం ప్రయివేటీకరణకు ముందుకు వస్తుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని దీని వల్ల ఉద్యోగులకు కాకుండా ప్రజలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. ప్రయివేటీకరణతో రైతులకు ఉచిత విద్యుత్, గృహ వినియోగదారులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు. జేపీసీ కో కన్వీనర్ తోట రాజశేఖర్, జేపీసీ నాయకులు రాజేందర్ గౌడ్, పూదరి గంగాధర్, ఆర్ బాలేశ్ కుమార్, కాశీనాథ్, నాంపల్లి, అశోక్, మల్లేశ్, జాకీర్ అలీ, చెన్నయ్య, ప్రసాద్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, శంకర్ గౌడ్, సునీత, నిజాముద్దీన్, నగేశ్, సతీశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

15న సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో ఈనెల 15న సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ శుక్రవారం పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 8 గంటలకు పాఠశాలలో కోచ్‌లు మౌనిక, నరేశ్, అనికేత్‌లను సంప్రదించాలన్నారు.

శబరిమాత ఆలయ సేవకుడు మృతి


అంజన్న(ఫైల్)

తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో పనిచేస్తున్న అంజన్న(70) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన అంజన్న సుమారుగా ఎనిమిదేళ్ల నుంచి ఆశ్రమంలో సేవ చేస్తు జీవిస్తున్నాడు. ఉదయం ఆశ్రమంలో సేవలు చేస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఆలయ కమిటీ సభ్యులు వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భక్తుడిగా ఆశ్రమానికి వచ్చి సేవలందించిన తీరు స్ఫూర్తినిచ్చాయని సభ్యులు పేర్కొన్నారు.

వెంచర్ అక్రమాలపై విచారణ ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


వెంచర్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

మాక్లూర్: మానిక్‌బండార్ శివారులోని సుమారు 217 ఎకరాల్లో ప్రయివేట్ వ్యక్తులు వెంచర్ వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ అక్రమాలపై 'ప్రభుత్వ నిధులతో వెంచర్‌కు వంతెన' అనే కథనాన్ని 'సాక్షి' దినపత్రికలో నవంబర్ 30న ప్రచురితం చేసింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు బఫర్‌జోన్ భూమిని శుక్రవారం పరిశీలించారు. వెంచర్ 217 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నందున పూర్తి విచారణకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. అలాగే బచ్చలకుంట చెరువుకు సంబంధించిన ఇరిగేషన్ భూమి కబ్జాకు గురైందా లేదా అనేది సైతం తేలాల్సి ఉంది. విచారణకు చేపట్టిన వారిలో ఇరిగేషన్ ఏఈ దివ్యభారతి, స్థానిక మాక్లూర్ ఆర్ఐ షఫీ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు. వారి వెంట 2వ డివిజన్ కార్పొరేటర్ రాయ్‌సింగ్, గ్రామస్తులు ఉన్నారు.

వలకు చిక్కిన భారీ చేప



మోర్తాడ్: మండల కేంద్రంలోని చెరువులో మత్స్యకారుల వలకు గురువారం భారీ చేప చిక్కింది. 20 కిలోల బరువు ఉన్న చేప శుక్రవారం చిక్కడంతో విక్రయించేందుకు మార్కెట్‌లో ఉంచారు. మోర్తాడ్‌లోని ముసలమ్మ చెరువులో ఇలాంటి చేప దొరకడం ఇదే మొదటిసారి అని మత్స్యకారులు తెలిపారు.

రక్తదానం గొప్ప సామాజిక సేవ

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి అర్బన్: రక్తం ఇవ్వడం ద్వారా ప్రాణాలు కాపాడే సామాజిక సేవ చాలా గొప్పదని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా సహజమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. శిబిరంలో దాదాపు 50 యూనిట్ల రక్తం సేకరించారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఎస్ఏవో రాజశేఖర్, డీఈలు కల్యాణచక్రవర్తి, నాగరాజు, ఏడీఈ కిరణ్ చైతన్య, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న, ప్రతినిధులు పీవీ నరసింహం, విద్యుత్ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి రిమాండ్

నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాలో ఈనెల 9న ఏఆర్ కానిస్టేబుల్ యాదగిరి ఇంట్లో జరిగిన హత్యాయత్నం కేసులో శుక్రవారం ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో యాదగిరితో పాటు అతని బావలు రమేశ్, గంగాధర్‌లు భార్య ఇందిర, కుమారులపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. భార్య ఇందిర ఫిర్యాదు మేరకు యాదగిరి, రమేశ్, గంగాధర్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రమేశ్‌ను అరెస్టు చేశామని, యాదగిరి, గంగాధర్‌లు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరు..

ఎల్లారెడ్డి: మండల కేంద్రానికి చెందిన బత్తుల హరికృష్ణ బైకును దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హరికృష్ణ తన బైకు చోరీకి గురైందని ఈ నెల 11న ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. విచారణలో నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన దొడ్లగోపాల్, ఎర్ర అశోక్ దొంగతనం చేశారని అన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ సతీశ్‌రెడ్డి శుక్రవారం పట్టుకున్నారు. ఐచర్ వాహనంలో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఐచర్, పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



రుద్రూర్: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పోతంగల్ మండలం కొడిచర్లలోని మూడు ప్రాంతాల్లో సుమారు 50 ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీజే ఆంప్లిఫైర్ ధ్వంసం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణానికి చెందిన పవార్ సాయి తరుణ్‌కు చెందిన డీజే ఆంప్లిఫైర్‌ను ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. సాయితరుణ్‌కు చెందిన డీజే ఆంప్లిఫైర్, కేబుల్స్‌ను నాగిరెడ్డిపేట మండలంలోని మెల్లకుంట తండా, మహదేవునిగడ్డకు చెందిన రాందాస్, విఠల్, అనిల్, నరేందర్ ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

బోధన్ రూరల్: గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై మచ్చేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాలురా శివారులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పీఎస్‌కు తరలించిన కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై కుక్కల దాడి



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని 7, 8వ వార్డుల పరిధిలో నలుగురిపై కుక్కలు దాడి చేసి గాయపర్చినట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో చిన్నారి కృత్విక, లక్ష్మయ్యతో పాటు 8వ వార్డులో మరో ఇద్దరిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాణాకలాన్‌లో చోరీ

ఎడపల్లి: మండలంలోని రాణాకలాన్‌కు చెందిన మోపుల కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. కృష్ణారెడ్డి వేరే గ్రామానికి వెళ్లి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చాడు. తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపాడు. చోరీలో ఐదు తులాల వెండి, రూ. 50వేలు విలువ చేసే పట్టు చీరలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలోని ధర్మారం(బి)-మెంట్రాజ్‌పల్లి రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం(50) లభించినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెంట్రాజ్‌పల్లి వైపు వెళ్తున్న స్థానికులు రోడ్డు పక్కన వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడిచేతిపై పుట్టుమచ్చ, 'సీతా రమేశ్ గవాతే-నాందేడ్-కొండిబా' అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లాక్ అండ్ వైట్ చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడు మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన వాడిగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 8712659851, 8712659852 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

బైక్ ఢీకొని రైతు మృతి


మల్లయ్య(ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ శివారులో కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై గురువారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఓ రైతు మృతి చెందాడు. ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కామటి మల్లయ్య(59) పొలం వద్దకు నడుచుకుంటు వెళ్తున్నాడు. వెనుక నుంచి ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి మల్లయ్యను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..



ఖలీల్‌వాడి: లారీ ఢీకొని తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గాయత్రీనగర్‌కు చెందిన నాగేశ్వరావు శ్రీచైతన్య స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా వర్ని చౌరస్తా వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. కుమారుడు బాల మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.